# ప్రతీకారము

రెండు సప్తాహాలు చేయటంచేత గోపాలానికి కొంత స్థితి ఏర్పడ్డది. పొలంబొట్రా సంపాదించాడు. భార్యకు కొంత సరకు ఏర్పడ్డది. ఇప్పుడు హాయిగా జీవనం చేస్తున్నాడు. కాని గోపాలంగారి జీవితచరిత్రలోని కొన్ని అంశములు రాసి లోకానికి ఉపకారం చేద్దామని బుద్ధిపుట్టింది.

గోపాలంగారు వయసుతనంలో కొంచెం అల్లరిగా తిరిగాడనే విషయం పాఠకులకు ఇదివరకే మనవి చేశాను. ఆయన యౌవనము ఆయనకు కొంచెం పోకిరీ అని గిట్టని వాళ్లు అంటూ ఉండేవాళ్లు: ముందర జుట్టు పెట్టుకొని తిరగటం వల్ల ఆయనను జూస్తే కొందరికి కిట్టదు.

అట్లా గిట్టని వాళ్లల్లో ముఖ్యుడు అప్పలాచారి. అతడు రాములవారి గుళ్లో అర్చకుడు. అసలు వీళ్ల ఇద్దరికీ ఉపద్రవమైన స్నేహం మొదట్లో. ఉత్సవం రోజులల్లో గోపాలం కూడా పట్టుబట్ట కట్టుకొని రథం మీద ఎక్కి కొబ్బరికాయలు అందుకొనేవాడు.

ఆ గుడిమాన్యం అనుభవిస్తూ ఉత్సవదినాలలో నాట్యంచేసే రామాబాయిని వీళ్లిద్దరు ఆదరించారని పూర్వపు రోజుల్లో అనుకొనే వాళ్లు. తరువాత వాళ్ల నేస్తం చెడింది. ఒకరితో ఒకరు మాట్లాడుతున్నా లోలోపల కోపాగ్ని రగులుతూనే ఉంది.

ఆ గుళ్లో అఖండం ఎల్లప్పుడూ వెలుగతూ ఉండేటట్లు పెద్దలు ఏర్పాటు చేశారు. ఎప్పుడు ఆ జ్యోతి ఆరిపోతుందో ఆ రోజు ఆ గ్రామానికి అరిష్టమని వాళ్ల నమ్మకం. ధర్మకర్తలే అఖండం ఖర్చుక్రింద ఒక మాన్యం వ్రాసి ఇచ్చారు.

ఒక రోజు సాయంత్రం గోపాలం గుడిదగ్గరగా పోతూ చుట్ట కాల్చుకొంటానికి అగ్గిపెట్టె లేక వెళ్లుతుంటే అప్పలాచారి ఆపి కాల్చుకోనివ్వలేదు. ఆ రోజు ఏం జెయ్యలేక గోపాలం ఊరుకొన్నాడు. కసి దీర్చుకొంటానికి నిరీక్షిస్తున్నాడు.

**– 2 –**

ఆరోజు అమావాస్య. కటిక చీకటిగా ఉంది. బస్తీకి వెళ్ళిన వాళ్లు, పొలానికి వెళ్లిన వాళ్లు ఇళ్లకు వచ్చారు. గోపాలం పిల్ల కాల్వ వంతెనమీద కూర్చొన్నాడు.

అప్పలాచారి నూనెడబ్బా నెత్తిన పెట్టుకొని ఆ దారినే వచ్చాడు. గోపాలం ఉన్న సంగతి అతనికి తెలయదు. గోపాలం మనిషి అలికిడి విని లేచి ముఖంవంక తేరపారజూచి.

"అప్పలాచార్లగారా – ఎందాక అర్ధరాత్రిలో. అప్పలాచారి ముఖం తెల్లబడ్డది. ఆ సంగతి గోపాలానికి తెలియటానికి వీలు లేదుగా! అందుకని ధైర్యంగా,

"రైలు దాకా నోయి"

"అల్లాగా! నెత్తిమీది దేమిటి?"

"ఆ! ఏం లేదు.. కందుల డబ్బా"

"కందుల డబ్బానా! నా దగ్గరా నీ జిత్తులు. నూనె డబ్బా కాదది? ఆఖండం అర్ధరాత్రి ఆర్పి నూనె కాజేయటం లేదూ నువ్వు?"

"అయితే నేమోయి!"

"అయితే ఏమి అంటున్నావా! నాకు సగం నీకు సగం"

"నీ కెందు కివ్వాలె"

"ఇస్తే నేనెవ్వరితో చెప్పకుండా ఉంచుతా లేక పోతే చెప్పేస్తా."

"నీవు చెపితే నమ్మేది ఎవరు. మెడకాయమీద తలకాయ ఉన్న నరమానవుడు నమ్మడు. నీవు అసలు ముందర జుట్టువాడివనీ నీ నడత లోపమనీ, సానిదాన్ని ఉంచుకొన్నావనీ అందరికీ తెలుసూ...."

"సానిదాని మాట ఎత్తావంటె వళ్ళు పగులుతుంది నువ్వు పత్తిత్తువా. నువ్వు ఉంచుకోలేదా!"

"నా సంగతి ఎవ్వరికి తెలియదు. నీ సంగతి గోల అయింది. అదిగాగ ఆ రోజు కొబ్బరిముక్కలు నీకు మరిన్ని పెట్టలేదని గుళ్లో దెబ్బలాడిన రోజున నిన్నే అందరు చీవాట్లు వెయ్యలే. అందరూ ఏమంటారో తెలుసునా? ఛా! పోవోయి. ఆచార్లుగారు దేవుడి సొమ్ము తింటారా. నీవు ఆయన మీద కల్పిస్తున్నావు, అని చీవాట్లేస్తారు."

"ఆచార్లూ", గోపాలం అన్నాడు, "చెబుతాను వినుకో– హితం చెబుతున్నా –

ఆనక చెడతావు. ఎక్కువద్దు. తక్కువద్దు. సగం భాగం యిస్తే యియ్యి ప్రతి నెల. లేకపోతే నీ నోట్లో మన్నే".

"సగం గాదుగదా ఒక్క పిసరైనా యివ్వను కావలిస్తే చెప్పుకో".

అని గాండ్రించి అప్పలాచారి బస్తీలోకి వెళ్ళిపోయినాడు. గోపాలం వళ్లు భగభగమండింది. ఆ పొయ్యేవాడి బుఱ్ఱ బద్దలు చెద్దామా అని అనిపించింది కాని తిరగబడితే తనే దెబ్బతింటాడు. అందుకని ధైర్యంతో ఊరుకొన్నాడు.

అప్పలాచారి కనుచూపు దూరం దాటిందాకా తీక్షణంగా చూచి "అదీ నిజమే- నేజెప్పినా నమ్మరు" అని తనలో తాను అనుకొని నిప్పు పుల్ల వెలిగించి చుట్ట ముక్క కాల్చుకొంటూ ఆటె ఆలోచించాడు. చుట్టముక్క అయిపోయేసరికి ఆలోచన తెగింది - "అదిపాయింటు అటు నుంచి నరుక్కురమ్మన్నాడు" అని అనుకొంటూ లేచి ఇంటికిపోయినాడు.

అప్పలాచారి పైకి 'చెప్పుకోపో' అన్నా లోపల బెంగగా ఉంది. నెలరోజులైంది. వూళ్ళో ఆ మాట ఎత్తిన వాళ్ళే లేరు. "ఇతడు చెప్పే ఉంటాడు. ఎవరు నమ్మి ఉందరు. వృధాగా భయపడి మూడు వీసెల నూనె పోగొట్టుకొన్నా అఖండం వెలిగింది" అని అనుకొని మళ్ళ ఎప్పటి మోస్తరు వ్యాపారం సాగించాడు.

**- 3 -**

ఆ రోజు ఆ వూళ్ళో హరికథ. తురక సాహేబు మస్తాన్ దాసు హరికథ చెబుతాడని విపరీతంగా చెప్పుకొని ఆ వూళ్ళో వాళ్ళంతా వచ్చారు. కథ మాంచి రక్తిగా ఉంది అన్నారు. సాహేబు మెడలో పూలదండలు వేసుకొని చేతులకు చామంతి పూలు కట్టుకొని నృత్యం చేస్తూ కథ చెబుతున్నాడు. ఏ జాతి అయితేనేం భక్తికి అనుకొంటున్నారు. వితంతు స్త్రీలు.

ఇంతలో గోపాలంగారింట్లో పెద్ద కేకలు వినబడ్డయి. ఓరి తల్లి ముండ మొయ్య దొంగల్రా - గోపాలంగారింట్లో కేక వేస్తున్నారు - అన్నాడు చాకటి సుబ్బడు.

కఱ్ఱలుచ్చుకొని హరికథ వదలిపెట్టి పరుగెత్తారు. గోపాలం బల్ల మీద పడుకునే గోలగా అరుస్తున్నాడు. పెద్దరాజు నాగన్న దగ్గరికెళ్ళి లేపి ఏమిటయ్యా గోల అన్నాడు.

ఏమిటా కేకలు - సంగతి చెప్పవేం. అని ఇంకోరన్నారు.

గోపాలం భయంకరంగా చూచి ఇదేమిటి మీరంతా వచ్చారేమిటి అన్నాడు.

కలవరింతయ్యా -అని ఒకరన్నారు.

"నాకే కలవచ్చిందో తెలుసునా మీకు. సరే మీరు రావటం మంచిదే. రాములవారు పచ్చని పీతాంబరాలు ధరించి పంగనామాలు దిద్ది నాకు కనుపించి వీపు మీద కొరడాలు పెళ్లు పెళ్ళున కొట్టాడు.

'ఎందుకు ప్రభూ' అన్నాను.

'వెధవ ఆవూళ్ళో చదువుకొన్నవాడివి ఉండి కూడా నాకు అన్యాయం జరుగుతుంటే ఊరుకొన్నావు. అర్చకుడు ఊరుమాటుమణగంగానే అఖండం అర్పి నూనె ఆదా చేస్తున్నాడు. ఇప్పుడు చూడు దీపం లేదు. పదిమందినీ తీసుకొనిరా అని అంతర్ధానమయినాడు".

కొంతమంది "దేవుడు నిన్ను పూనవచ్చాడా, నీకంటె భక్తుడు లేకపోయినాడా" అన్నారు.

ఆహా అదేమన్నమాటరా. ఇట్లా చూడు వీపు మీద దెబ్బలెల్లా కనబడుతున్నవో అన్నాడు చిన్నారెడ్డి. 'ఇదంతా ఎందుకోస్ గుళ్ళోకిపోయి చూద్దాంరా. అఖండం ఎలుగుతుందో లేదో తేలుతుంది అన్నాడు పెద్దారెడ్డి. నడవండి అంటె నడవండి అన్నారు. ఆచార్లును లేపితే అతడొచ్చి గుడితలుపు తెరిచాడు. దీపం లేదు. అఖండం వెలగటం లేదేమయ్యా ఆచార్లయ్యా అంటే "ఆరిపోయిందేమో గాలికి" అన్నాడు ఆచారి. గుళ్ళోకి గాలి రావలసిందే! దీపం బెట్టి చూడండి అసలు నూనె పోసాడో లేదో అన్నాడు రెడ్డయ్య. దీపం బెట్టి చూస్తే అసలు నూనేలేదు.

ఏమిటిది నిజం చెప్పెయ్యి.

మావూరికి అనర్ధం తెద్దామనుకొన్నావయ్యా.

నూనె కాజేస్తున్నాడు.

ఎంత అనర్ధం ఎంత అనర్ధం అన్నారు. తలోమాట

'చూస్తారేంరా' అన్నాడు పెద్దారెడ్డి.

'కమ్ముకోండోసి' అన్నాడు చిన్నారెడ్డి.

బైటికి లాగి - గుళ్ళో కొట్టకూడదుగా- తడిపిడి వాయించారు.

*('జనరంజని' మాసపత్రిక, అక్టోబరు 1924)*